దిన పత్రిక
తొలి సమయం
వాస్తవమే గమ్యం! గమనం!!
శనివారం । 4 । జూలై । 2026

# నాగన్న మృతి విప్లవ సాంస్కృతికోద్యమానికి తీరనిలోటు

## -- సంయుక్త ప్రకటనలో తెలియజేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అరుణోదయ సాంస్కృతిక రాష్ట్ర కార్యదర్శి షేక్ షావలి మరియు అరుణోదయ రెండు తెలుగు రాష్ట్రాల కన్వీనర్ ఇనుప సురేష్



**తొలి సమయం డెస్క్ హైదరాబాద్ జూలై 3**
సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ నాయకులు మరియు అరుణోదయ సాంస్కృతిక సీనియర్ నాయకులు అయిన నాగన్న మృతి విప్లవ సాంస్కృతికోద్యమానికి తీరనిలోటు అని సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ అనుబంధ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షావలి మరియు రెండు తెలుగు రాష్ట్రాల అరుణోదయ కన్వీనర్ ఇనుప సురేష్ పంపిన ఒక సంయుక్త పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. 2026, జూలై-3, శుక్రవారం రోజు, ఖమ్మంలో మధ్యాహ్నం సుమారు రెండు గంటలకు కన్నుమూసిన సాంస్కృతిక సేనాని నాగన్నకు తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్రమశిక్షణ కలిగిన జీవితం, నిబద్ధత నాగన్న సొంతం అని కొనియాడారు. చివరిశ్వాస వరకు నిజమైన కార్మికవర్గ నాయకుడిగా కొనసాగి, ఎందరో విప్లవ సాంస్కృతిక సైనికులకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై, చావు అంచులదాక వెళ్ళి, మరణాన్ని జయించిన వీరుడిగా ప్రశంసలు అందుకొన్న కొద్ది రోజులకే తుదిశ్వాస విడిచిన నాగన్నకు షేక్ షావలి, ఇనుప సురేష్ లు విప్లవ జోహార్లు అర్పిస్తున్నట్లు ప్రకటనలో తెలియజేశారు.

# రైతులకు 7రకాల సన్న రకం వరి విత్తనాలు విత్తన డీలర్ల ద్వారా సరఫరా..

## జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ విజయచంద్ర..



**తొలి సమయం మహబూబాబాద్ జూలై 3**
పట్టణంలోని రైతు వేదిక కార్యాలయంలో మహబూబాబాద్ డివిజన్ పరిధిలోని విత్తన డీలర్లకు తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సహించిన ఏడు వరి సన్న రకమైన విత్తనాలను (బిపిటి 5204, ఆర్ ఎన్ ఆర్ 15048, డబ్ల్యూ జి ఎల్ 44, హెచ్ఎంటి సోనా, కే ఎన్ ఎం1638, కే ఎన్ ఎం 7715, జైశ్రీరామ్ ) రైతులకు విత్తన డీలర్ల ద్వారా సరఫరా చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ రవిచంద్ర తెలిపారు ఆయన తెలిపారు వటీఎస్ అగ్రి సీడ్స్ రూపొందించిన ఓఎల్ఎంఎస్ లాగిన్ లో ఎంటర్ చేయుటకు మహబూబాబాద్ డివిజన్ పరిధిలోని విత్తన డీలర్లకు శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. విజయచంద్ర ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విత్తన డీలర్లకు ప్రభుత్వం ప్రోత్సహించిన ఏడు సన్న రకమైన వరి విత్తనాల వివరాలను తప్పకుండా పోర్టల్ లో ఉంచాలని తెలిపారు. రైతులకు సన్న రకాలైన వరి విత్తనాలను సాగు చేయుటకు ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు అజ్మీరా శ్రీనివాసరావు, మహబూబాబాద్ మండల వ్యవసాయ అధికారి నారెడ్డి తిరుపతిరెడ్డి, గూడూరు మండల వ్యవసాయ అధికారి ఎండి. మాలిక్ మరియు ఇతర విత్తన డీలర్లు పాల్గొన్నారు

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



**తొలిసమయం, సుజాతనగర్, జూలై 03 :**
హోటల్ గోంగూర 6వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గోపతండ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. హోటల్ గోంగూర యజమానులు చావా మధు, ఆయన సతీమణి లక్ష్మీ దుర్గ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులందరికీ నోట్‌బుక్కులు, పెన్సిళ్లు, పెన్నుల సెట్లు అందజేశారు. అనంతరం హోటల్ అరిటాకు యాజమాన్యం విద్యార్థులు, ఉపాధ్యాయులకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తాటిపల్లి శంకర్‌బాబు, చోళమండలం వెహికల్ ఫైనాన్స్ మేనేజర్ దాసరి కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. రాజారావు, ఉపాధ్యాయులు బి. బిక్కు, వార్డు సభ్యులు మాన్‌సింగ్, ఎం. అమ్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చావా మధు, లక్ష్మీదుర్గా దంపతులు మాట్లాడుతూ, విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ఎంతో ఆనందంగా ఉందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొని నిర్వాహకులను అభినందించారు.

# నూతన గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న సర్పంచ్ శ్రీకాంత్

**తొలిసమయం, సుజాతనగర్, జూలై 03 :**
స్టేషన్ బేతంపూడి గ్రామపంచాయతీ పరిధిలో జరిగిన రంగు ప్రకృతంబబ్రహ్మాచారి దంపతుల నూతన గృహప్రవేశ వేడుకలో సర్పంచ్ శ్రీకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దంపతులకు నూతన వస్త్రాలు అందజేసి సత్కరించిన ఆయన, కొత్త ఇంట్లో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భుక్యా మాన్సింగ్, ఉపసర్పంచ్ సక్రం, మాజీ ఎంపీటీసీ షేక్ ఖాజామియా, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ అరుణోదయ నాగన్నకు అరుణారుణ జోహార్లు..

**తొలి సమయం మహబూబాబాద్ బయ్యారం జూలై 3:**
నాగన్న మరణం విప్లవ సాంస్కృతిక ఉద్యమాలకు తీరని లోటని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మానుకోట జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు..మృతులు నాగన్న కు నివాళులు అర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..50 ఏళ్ల ఉద్యమ గానం మూగబోయింది. ఎమర్జెన్సీ చీకట్లను చీల్చుకుంటూ సైరన్ మోతై ప్రజలను మేల్కొల్పుతూ ప్రారంభమైన నాగన్న పాట నేడు ఆగిపోయింది. ఎమర్జెన్సీ కాలంలో రాజ్యం బూటకపు ఎన్కౌంటర్ కు బలైన శ్రీపాద శ్రీహరి జన్మస్థలమైన రాజారంలో పుట్టిన నాగన్న ఆయన వారసత్వాన్ని స్వీకరించి ఎమర్జెన్సీ ముగిసిన వెంటనే కంజర పట్టుకొని, కాలుకు గజ్జ కట్టుకొని ఉద్యమ గానమై ఊరూరు తిరిగాడు. అవి ఎన్నికలైనా, సభలైనా అక్కడ నాగన్న గొంతు గర్జించాల్సిందే. ఆయన తిరగని ఊరు లేదు, పాడని పాట లేదు. 50 ఏళ్ల తన విప్లవ సాంస్కృతిక ప్రస్థానంలో నాగన్న ఉన్నత శిఖరాలను అందుకున్నాడు. నేడు నాగన్న అనే పేరు ఉద్యమ పాటకు మారుపేరుగా నిలిచింది. 1978 79 లలో మొదటిసారి నేను నాగన్న పాట విన్నాను. బయ్యారం మండలం గందంపల్లిలో ఎమ్మెల్ పార్టీ రాజకీయ తరగతుల సందర్భంగా పెట్టిన బహిరంగ సభలో నాగన్న అన్న అమరుడురా మన రామనర్సయ్య పాటను పాడాడు. ఎవరీ నాగన్న అని అడిగితే ఖమ్మం దగ్గర ఒక టైలర్ అని చెప్పారు. ఆ తర్వాత నేను ఖమ్మంలో డిగ్రీ చదువుకుంటున్న రోజుల్లో పిడిఎస్యూ సభలతో సహా ఏ సభలలోనైనా నాగన్న పాటలు విధిగా వుండేవి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నాగన్న లేని సభలు లేవంటే కూడా అతిశయోక్తి కాదు. ఆ తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా కూడా నాగన్న గొంతు మారుమోగింది. 1986లో మద్దివంచలో మా నాన్న స్మారక స్తూపావిష్కరణ సభలో నా పెండ్లి జరిగినప్పుడు దానికి నాగన్న సృజన నూతనలతో వచ్చి పాటలు, కళా రూపాల ప్రదర్శన ఇచ్చాడు. 96 నుండి నాగన్న నేను పార్టీ ఖమ్మం జిల్లా కమిటీలో సభ్యులుగా కొనసాగాము. అప్పటినుండి నాగన్నతో మరింత సాన్నిహిత్యం ఏర్పడింది. బయ్యారంలో అరుణోదయ శిక్షణా క్యాంపులు, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం సందర్భంగా నాగన్న సాంస్కృతిక కార్యక్రమాలు, బయ్యారం వీరపుత్రులు క్యాసెట్ రికార్డింగ్ తదితర అనేక సందర్భాలలో రోజుల తరబడి కలిసి వున్న సందర్భాలెన్నో. 2019లో మద్దివంచలో నిర్మించిన అమ్మా నాన్నల ప్రాంగణం ఆవిష్కరణకు నాగన్నను గెస్ట్ గా ఆహ్వానించాము. దానిని ఆవిష్కరించిన సందర్భంగా నాగన్న మొదటిసారి నువ్వే నా పేరు శిలాఫలకంపై ఎక్కించావని నవ్వుతూ మాట్లాడాడు. నాగన్న నిరాడంబరుడు, నిస్వార్థ విప్లవ సైనికుడు. ఆయన నమ్మిన రాజకీయ విలువల కోసం చివరిదాకా పనిచేశాడు. విప్లవోద్యమంలో ముందుకొచ్చిన కొంత మంది కవులు, కళాకారులు కాలక్రమంలో గాడి తప్పి రకరకాల ప్రవాహాలలో కొట్టుకు పోయినా నాగన్న చివరిదాకా నికరంగా నిలబడ్డాడు. ఆర్థిక సమస్యలతో పాటు ఎన్ని ఆటంకాలెదురైనా ఎదుర్కొని ముందుకు సాగాడు. కానూరి వారసుడిగా అరుణోదయ పతాకాన్ని సమున్నతంగా ఎత్తిపట్టి సంస్థ పేరును ఇంటిపేరుగా మార్చుకున్నాడు. ఉక్కు క్రమశిక్షణ కలిగిన సాంస్కృతిక ఉద్యమ శిఖరం కామ్రేడ్ నాగన్న. ఆయన పాటలు ఉద్యమ కార్యకర్తలకు నిరంతర ఉత్తేజాన్ని అందిస్తాయి. ఆయన గళం అజరామరంగా వెలుగుతుంది. మన కాలపు స్ఫూర్తి ప్రధాత, విప్లవ సాంస్కృతిక దృవతార కామ్రేడ్ నాగన్నకు అరుణారుణ జోహార్లు

# పెబ్బేరులో ఘనంగా వరల్డ్ మెకానిక్ డే వేడుకలు



**తొలి సమయం పెబ్బేరు జూలై 3**
శ్రీ సాయిబాబా మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ .మున్సిపల్ ఛైర్మన్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొనడం విశేషంపెబ్బేరు : వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో శ్రీ సాయిబాబా మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో వరల్డ్ మెకానిక్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి పెబ్బేరు మున్సిపల్ ఛైర్మన్ శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజ అభివృద్ధిలో మెకానిక్‌ల పాత్ర ఎంతో కీలకమైందని, వాహనాల నిర్వహణ, రవాణా వ్యవస్థ సజావుగా కొనసాగడంలో వారి సేవలు ప్రశంసనీయమని అన్నారు. మెకానిక్‌లు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం యూనియన్ సభ్యులు వరల్డ్ మెకానిక్ డే సందర్భంగా పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొని, మెకానిక్‌ల సంక్షేమం కోసం ఐక్యంగా పని చేయాలని ప్రతిజ్ఞ చేశారు. మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు వెంకటేష్ సాగర్, రణధీర్ రెడ్డి, యూనియన్ నాయకులు, మెకానిక్‌లు భాస్కర్, బండమీది నరసింహ, ఎండి. ఉస్మాన్, ఎండి. బురాన్, విశ్వనాథ్ రెడ్డి, ఎండి. మోయిన్, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జాతి ఐక్యతే ఏకైక లక్ష్యం సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు భూక్య సంజీవ్ నాయక్

**కార్పొరేషన్ మేయర్, మార్కెట్ కమిటీ ఛైర్మన్‌లకు ఘన సన్మానం**

**'గూడెం'లో బంజారా భవన్ నిర్మాణానికి కృషి : మేయర్ గణేష్ నాయక్**

**మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు పూర్తి న్యాయం చేస్తాం : ఛైర్మన్ లాల్‌సింగ్**

**హక్కుల కోసం ఐక్యంగా పోరాడుదాం : సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు హుస్సేన్ నాయక్**

**బంజారా సంఘాల జేఏసీ ఛైర్మన్‌గా వీరు నాయక్ రెండోసారి ఏకగ్రీవ ఎన్నిక**



**తొలిసమయం, కొత్తగూడెం, జూలై 03 :**
బంజారా జాతి ఐక్యత కోసం ప్రతి ఒక్కరు కలిసి రావాలని, ఐక్యత ద్వారానే హక్కులు సాధించుకోవచ్చునని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు భూక్య సంజీవ్ నాయక్ పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ శంకర్ నాయక్, వైస్ ఛైర్మన్ బానోత్ వీరు నాయక్‌ల ఆధ్వర్యంలో సభాధ్యక్షులుగా టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ రాములు నాయక్, గ్రీన్ ఎర్త్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు భూక్య రమేష్ రాథోడ్‌లు వ్యవహరించగా, జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ నాయక్, కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోత్ లాల్‌సింగ్, వైస్ ఛైర్మన్ భూక్య జనార్ధన్ మరియు డైరెక్టర్లు అజ్మీరా అమ్రు, మాళోత్ అశోక్ బాబు, సపావట్ రవి, బానోత్ రవి, తేజావత్ రవికుమార్, ఇస్లావత్ హరిలాల్, తేజావత్ శివలకు శాలువాలు కప్పి, పుష్ప గుచ్చాలు, మెమొంటోలు అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంజీవ్ నాయక్ మాట్లాడుతూ విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో బంజారాల ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. జాతి మనుగడకోసం ఉద్యోగ, ఉపాధ్యాయ, సంఘటిత, అసంఘటితరంగ కార్మికులు, ఉద్యోగులంతా కలిసి రావాలని కోరారు. బంజారాలకు దక్కాల్సిన పథకాలు, హక్కులను పోరాడి సాధించుకుందామన్నారు.

'గూడెం'లో బంజారా భవన్ నిర్మాణానికి కృషి :
మేయర్ గణేష్ నాయక్‌కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఛైర్మన్ మూడ్ గణేష్ నాయక్ మాట్లాడుతూ గిరిజన జిల్లా అయిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో బంజారాలకు ఎలాంటి కమ్యూనిటీ భవనాలు లేవని, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో బంజారా భవన్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే నిధులు మంజూరయ్యాయని, త్వరితగతిన ప్రక్రియను ప్రారంభించేందుకు చర్యలు చేపడతానన్నారు. బంజారాలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని చెప్పారు. గతంలో తనకు సేవాలాల్ సేనలో సంఘ బాధ్యుడిగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ తొలి మేయర్‌గా బంజారా జాతికి చెందిన తనను నియమించడం పట్ల ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్‌పాషాలకు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తాం :
ఛైర్మన్ లాల్‌సింగ్‌కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోత్ లాల్‌సింగ్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా నిర్వీర్య దశలో ఉన్న కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీకి మళ్లీ పునర్జీవం అందిస్తామన్నారు.

హక్కుల కోసం ఐక్యంగా పోరాడుదాం :
సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు హుస్సేన్ నాయక్‌బంజారాల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడుదామని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు బానోత్ హుస్సేన్ నాయక్ పిలుపునిచ్చారు. ఇన్నాళ్లు తనను ఛైర్మన్‌గా ఆదరించిన ఆదరించిన బంజారా సంఘాల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. జేఏసీ ఛైర్మన్‌గా బానోత్ వీరు నాయక్ రెండవసారి ఏకగ్రీవ ఎన్నికఈ సందర్భంగా బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన ఛైర్మన్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఇప్పటివరకు వైస్ ఛైర్మన్‌గా పనిచేసిన బానోత్ వీరు నాయక్‌ను మరోసారి ఛైర్మన్‌గా ఎన్నుకుంటూ ప్రస్తుత ఛైర్మన్ డాక్టర్ శంకర్ నాయక్ ప్రతిపాదించగా, సంఘాల నాయకులు ఆమోదించారు. గతంలోనూ ఛైర్మన్‌గా పనిచేసిన అనుభవం వీరునాయక్‌కు ఉంది. ఈ సందర్భంగా వీరూనాయక్ మాట్లాడుతూ బంజారాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అందరినీ కలుపుకునిపోతూ పోరాటాలు చేస్తానని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులతోపాటు అన్ని పార్టీల్లోని బంజారా నాయకులందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి బంజారాల సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కార్యదర్శులు ధరావత్ కన్షీరామ్, అజ్మీరా శంకర్, గుగులోత్ శంకర్, ట్రెజరర్ బానోత్ రమేష్, బిజెపి జిల్లా సెక్రెటరీ బోడ పుణ్య నాయక్ టిఎస్‌టిటిఎఫ్ జిల్లా కార్యదర్శి సపావట్ బాలకృష్ణ, భూక్య బాబులాల్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు మాళోత్ శివ, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు గుగులోత్ బద్రు నాయక్, బంజారా పూజారుల సంఘం జిల్లా అధ్యక్షులు బానోత్ గణేష్, సేవాలాల్ సేన మహిళా నాయకురాళ్లు భూక్య రుక్మిణి, భట్టు మంజుల, ఘంసీ, యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు మాళోత్ రాజా, యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు జర్పుల బాలు, పీఆర్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు. మున్సిపల్ కార్పొరేషన్ ఇన్స్పెక్టర్ అశోక్ చౌహాన్. మాజీ ఎంపీటీసీ గోవింద్. సిపిఐ పార్టీ నాయకులు ఉపేందర్. ప్రసాద్, సేవాలాల్ సేన జిల్లా నాయకులు. గుగులోత్ చందర్. భట్టు హుస్సేన్, ధరావత్ కృష్ణ, సేవలాల్ సేన యువసేన జిల్లా అధ్యక్షులు బానోత్ భరత్. సేవిలాల్ సేన పాల్వంచ మండల అధ్యక్షులు. జరుపుల పరమేష్, పిసా చట్టం మొబిలైజర్ ఇస్లావత్ లాలు. యువసేన అధ్యక్షులు కుమార్ నాయక్ రాజా సురేష్. చుంచుపల్లి సర్పంచ్ భూక్య వీరన్న, మాజీ సర్పంచ్ రాంచంద్రు, జేఏసీ కో కన్వీనర్లు ఇస్లావత్ సాంబశివ నాయక్. జాటోత్ భరత్, లావుడ్య హన్మంతు, భూక్య శివ, ధరావత్ రవి, మురళి, బాలు నాయక్. సోషల్ మీడియా ఆర్గనైజర్ వినోద్. నరసింహ. సింగరేణి సంఘ నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నాయకులు, గిరిజన సంఘ నాయకులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి





**తొర్రూరు-జూలై 03 తొలి సమయం పాలకుర్తి మండలం**
తొర్రూరు జే గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే శ్రీమతి యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఇండ్లను ప్రారంభించారు. గ్రామానికి చెందిన పులి స్వర్ణ-రాజు, గోనె అనసూర్య-బుచ్చయ్య, పులి రేణుక-యాకయ్య, రాగేరు భాగ్యమ్మ-గుట్టయ్య దంపతుల నూతన గృహాలను ఎమ్మెల్యే ప్రారంభించి, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడే దిశగా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అధికారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిన్నారులకు ఆశీస్సులు అందించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**తొలి సమయం-తొర్రూర్ జూలై 03**
తొర్రూర్ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కొయ్యడి ప్రవీణ్-భవాని దంపతుల కుమారుడు, కుమార్తె తొలి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు పాలకుర్తి ఎమ్మెల్యే శ్రీమతి యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిన్నారులతో కలిసి కేక్ కట్ చేయించిన ఎమ్మెల్యే, వారికి ఆశీస్సులు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు ఆయురారోగ్యాలతో, విద్యా విజ్ఞానాలతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఇలాంటి శుభ సందర్భాలు కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తాయని, ప్రజలతో ఆత్మీయ అనుబంధమే తనకు అతిపెద్ద బలమని, వారి సంతోషాల్లోనూ, కష్టసుఖాల్లోనూ ఎల్లప్పుడూ భాగస్వామిగా ఉంటానని అన్నారు. అనంతరం కొయ్యడి ప్రవీణ్-భవాని దంపతులు, కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించారు. తమ ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసి చిన్నారులను ఆశీర్వదించిన ఎమ్మెల్యేకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# తెలగవరం పాఠశాలకు మైక్ సెట్ విరాళం అందించిన నున్నా ప్రదీప్ - సుజాత దంపతులు

## అభినందించిన పిఆర్.పిప జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వర్లు



**తొలిసమయం, తల్లాడ, జూలై 03 :**
తల్లాడ మండలం తెలగవరం ప్రాథమిక పాఠశాలకు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో రూ.15 వేల విలువైన అహుజా మైక్ సెట్‌ను నున్నా ప్రదీప్‌సుజాత దంపతులు విరాళంగా అందజేశారు. ఈ మైక్ సెట్‌ను నున్నా సాత్విక్ (ఎన్ఆర్ఐ) తన తల్లి సుజాత జ్ఞాపకార్థం అందించారు. మైక్ సెట్‌ను నూతనకల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఏ. రమేష్, పీఆర్‌పీఏ జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వర్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేమిరెడ్డి అచ్చిరెడ్డి, ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా యలమద్ది వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న నున్నా ప్రదీప్‌సుజాత దంపతుల దాతృత్వం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేమిరెడ్డి అచ్చి రెడ్డి , పిఆర్టియు టిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రాయల నరసింహారావు, తల్లాడ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉంగరాల వెంకటేశ్వర్లు, అద్దంకి గోపాల క్రిష్ణ, గ్రామ సర్పంచ్ భూక్యా కాళోజి, ఉప సర్పంచ్ సిలివేరు నరసింహ రావు, డీలర్ తూము నరసింహ రావు, ఉపాధ్యాయులు ముదిగొండ తిరుపతి రావు, అనుమోలు రాఘవ రావు, నేలపట్ల మహేష్ పాల్గొన్నారు.